క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



దుత్తలూరు: నర్రవాడ ఎస్టీ కాలనీలో చలివేంద్రాన్ని తహసీల్దార్ యనమల నాగరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గిరిజనుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దాతలు ముందుకొచ్చి కూడలి ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

కావలి(జలదంకి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 16 మంది సభ్యులకు గానూ ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరవడంతో వాయిదా వేసినట్లుగా ఎంపీడీఓ చేవూరు శ్రీదేవి తెలిపారు. సమావేశాన్ని తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

జేవీవీ నూతన కార్యవర్గ ఎన్నిక



ఉదయగిరిరూరల్: పట్టణంలోని షాదీమంజిల్‌లో జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు షేక్ దస్తగిరిఅహ్మద్ అధ్యక్షతన మండల కార్యవర్గ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. మండల గౌరవాధ్యక్షులుగా జీసీ ఓబుల్‌రెడ్డి, షేక్ నస్రుల్లా, అధ్యక్షుడిగా షేక్ మున్నా, ప్రధాన కార్యదర్శిగా షేక్ మసూద్, కోశాధికారిగా కంచుపాటి సురేష్, ఉపాధ్యక్షులుగా సంగన భాస్కరరెడ్డి, షేక్ ఖాజాపీర్, షేక్ దావూద్, కార్యదర్శులుగా అశోక్, మహమ్మద్‌అలీ, షేక్ షబ్బీర్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కే శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీ చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షులు బీ శ్రీనివాసులు, జిలానీబాషా, మాలకొండారెడ్డి, ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఖత్నాలు



ఉదయగిరి: స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో ఉచిత ఖత్నాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రహ్మతుల్లా ఆలమిన్ ట్రస్ట్, చిన్నమసీదు కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో వంద మంది చిన్నారులకు ఉచిత ఖత్నాలు నిర్వహించారు. జేవీవీ నాయకుడు షేక్ దస్తగిరిఅహ్మద్ మాట్లాడుతూ చిన్నమసీదు కమిటీ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం : మండలంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి మంగళవారం తెలిపారు. సీతారామపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మండల పరిధిలోని అన్ని ఫీడర్లకు నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం ఆదూరుపల్లిలోని 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ సిబ్బంది మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేషన్ సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదు

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంఖవరంలో రేషన్ సరుకులు సక్రమంగా అందించడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇటీవల డీలర్ మరణించారని, అప్పట్నుంచి రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఆధార్ శిబిరం పరిశీలన

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీఓ షాలెట్ మంగళవారం పరిశీలించారు. 7, 8 తేదీల్లో సిద్ధీపురం సచివాలయంలో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగనన్న కాలనీలపై శీతకన్ను

మున్సిపల్ పరిధిలోని పమిడిపాడు, నెల్లూరుపాళెంలో జగనన్న కాలనీలపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసింది. కాలనీల్లో కనీస మౌలిక వసతులను కల్పించడంలో నిర్లక్ష్యం వహించడంతో గృహ లబ్ధిదారులు నిర్మాణాలను నిలిపివేశారు. మరోవైపు ఇప్పటికే గృహాలను పూర్తి చేసుకుని ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నెల్లూరుపాళెం కాలనీలో అంతర్గతరోడ్లను ఆక్రమించిన కంపచెట్లు



నెల్లూరుపాళెం కాలనీలో అధ్వానంగా అంతర్గత రోడ్డు



అభివృద్ధికి నోచుకోని నెల్లూరుపాళెం కాలనీ మెయిన్ రోడ్డు

ఆత్మకూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో మున్సిపల్ పరిధిలోని పమిడిపాడు, నెల్లూరుపాళెంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేసింది. అందులో 4,800 మంది పేదలకు ఇళ్ల ప్లాట్లు కేటాయించింది. తొలివిడతగా దాదాపు రెండు వేల ఇళ్లను మంజూరు చేసింది. కాలనీల్లో గృహాలను నిర్మించుకునేందుకు వీలుగా విద్యుత్, తాగునీరు, తదితర సౌకర్యాలను కల్పించింది. గ్రావెల్‌తో అంతర్గత రోడ్లను సైతం నిర్మించింది. దీంతో లబ్ధిదారులు ముందుకొచ్చి గృహ నిర్మాణాలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు రావడం.. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలపై శీతకన్ను వేసి మౌలిక వసతులు కల్పించకపోవడంతో మిగిలిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను నిలిపివేశారు. నెలల తరబడి గృహ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు సైతం కాలనీలపై నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుతం కాలనీల్లోని వాటర్ ట్యాంకులు మాయమయ్యాయి. వీధి కుళాయిలు సైతం విరిగిపోయాయి. స్థానికులే సొంత ఖర్చులతో వీధి కుళాయిలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కాలనీల్లోని కొన్ని ప్రాంతాలు కంపచెట్లతో చిట్టడవులను తలపిస్తున్నాయి. వీధి దీపాలు సైతం వెలగడం లేదు. నెల్లూరుపాళెం కాలనీలో దాదాపు వేయి ఇళ్లను మంజూరు చేయగా, అందులో 50 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు సైతం చేశారు. మరో వంద ఇళ్ల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. నెల్లూరుపాళెం కాలనీకి నెల్లూరు–ముంబయి రహదారి నుంచి ఉన్న మెయిన్ రోడ్డు కొద్దిపాటి వర్షం పడితే చిత్తడిగా తయారవుతోంది. కనీసం నడిచి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది. ఆర్డీఓ కార్యాలయం వద్ద నుంచి కాలనీలోకి మరో రహదారి ఉంది. ఆ రహదారి సైతం అధ్వానంగా ఉంది. కనీసం ఈ రోడ్డుకు అయిన మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



23వ వార్డు పరిధిలోని నెల్లూరుపాళెం వైఎస్సార్ జగనన్నకాలనీలో వేయికి పైగా గృహాలు మంజూరయ్యాయి. 50 కుటుంబాలు నిర్మాణాలు పూర్తి చేసుకుని కాపురాలు ఉంటున్నాయి. కాలనీలో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వీధిదీపాలు, రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలి.

– సీహెచ్ కామాక్షయ్యనాయుడు, కౌన్సిలర్, ఆత్మకూరు

వసతుల కల్పనకు చర్యలు

ప్రభుత్వ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరై ఉన్నాయి. కౌన్సిల్ ఆమోదంతో మౌలిక వసతుల కల్పనకు కేటాయిస్తాం.

–గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్

వేసవి విజ్ఞాన శిబిరం

వింజమూరు(ఉదయగిరి): చిన్న చిట్కాలు, మెళకువలు పాటించి సాధన చేయడం ద్వారా గణితంపై మంచి పట్టు సాధించవచ్చని గణితశాస్త్ర ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాయబ్‌రసూల్ పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వింజమూరు గ్రంథాలయంలో విద్యార్థులకు గణిత శాస్త్రంపై అపోహలు, సమస్యలను ఎలా పరిష్కరించాలన్న దానిపై మంగళవారం అవగాహన కల్పించారు. గణితంపై ఏ విధంగా పట్టు సాధించాలనే అంశాలపై అనేక పుస్తకాలు ఉన్నాయని, వాటిని చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జ్యోతికొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యఆరోగ్య సిబ్బంది నిరసన



వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం వైద్యఆరోగ్య సిబ్బంది నిరసన తెలిపారు. సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌లపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత ఆశాడే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో అరాచక పాలన

- ప్రజాస్వామ్యంలో ప్రశ్నించినా, అవినీతిని ఎండగట్టినా కేసులా
- కూటమి ప్రభుత్వ తీరుపై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి (జలదంకి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కావలిలో అరాచకపాలన సాగుతోందని, అవినీతి, అక్రమాలపై ప్రశ్నించినా కేసులు పెట్టి రాక్షసానందం పొందుతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ బోగోలు మండలాధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘుయాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై కూటమి నాయకులు దాడి చేసి తిరిగి మళ్లీ కేసులు పెడుతున్నారన్నారు. 2020లో దర్యాప్తు చేసి మూసివేసిన కావలిలో అమృత్ పైలాన్ ధ్వంసం కేసును రీ ఓపెన్ చేసి కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను, అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అవినీతిని ఎండగట్టిన మీడియాపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. కూటమి నాయకుల మెప్పు కోసం అక్రమ కేసులు బనాయిస్తున్న అధికారులు కూడా న్యాయంగా పని చేయాలన్నారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే కావలిని కాపు కాస్తానని చెప్పి కక్ష రాజకీయాలకు తెరతీసాడన్నారు. జలదంకి మండలంలో చేసిన అరాచక సంస్కృతిని కావలిలో ప్రదర్శించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై మీరు పెట్టే అక్రమ కేసులకు భయపడే ప్రసక్తి లేదని, న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు మాట్లాడుతూ రెండు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్‌కుమార్ రెడ్డి ఎంత సౌమ్యుడో, ప్రజలతో, మీడియాతో ఎంత సఖ్యతగా ఉన్నారో అందరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అక్రమాలే రాజ్యమేలుతున్నాయన్నారు. ప్రజలకు మంచి చేయకుండా ఇసుక, గ్రావెల్, మట్టి దోపిడీపై ప్రశ్నిస్తే చాలు మాజీ ఎమ్మెల్యేతో పాటు నాయకులు, జర్నలిస్టులపై అక్రమ కేసులకు బరి తెగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగం నడిపిస్తుందన్నారు. టీడీపీ నాయకులు ప్రభుత్వ భూముల ఆక్రమణ, మైనింగ్, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాతో అందినకాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కలికి శ్రీనివాసులరెడ్డి, నందనవనం సీతామాలక్ష్మి, వాయిల తిరుపతి, కుందుర్తి కామయ్య, పేరం వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసులు, గుడ్లూరు మాల్యాద్రి, వేగూరు పుల్లయ్య, నాగేశ్వరమ్మ, కళ్యాణి, నాయబ్‌రసూల్, సుందర్‌రాజ్, స్కైలాబ్, వెంకటేశ్వరరెడ్డి, గయాజ్, గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నిరసన ప్రదర్శన



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

ఉదయగిరి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజారవాణాశాఖ కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ఎస్డీ మౌలాలి మాట్లాడుతూ ప్రజారవాణా శాఖలో సుమారు ఆరేళ్లుగా ఉద్యోగులకు పదోన్నతులు లేవన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారులు ఇచ్చే మెడికల్ సర్టిఫికెట్లను డీఎం పరిగణనలోకి తీసుకోకుండా కార్మికుల జీతాలు నిలుపుదల చేయడం, చార్జిషీట్లు, పనిష్మెంట్ ఇవ్వడం, తదితర ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. డిపోలో 01/2019 సర్క్యులర్‌ను అమలుపరచాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. మహిళలకు ప్రత్యేక పరిస్థితుల్లో అవసరమైన సెలవులు మంజూరు చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం డీటీ షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రియాజ్, నాగరాజు, రవి, ఫణికుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



సంగం : ఆశా కార్యకర్తకు యూనిఫామ్ అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

సంగం/అనుమసముద్రంపేట: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, డీఎల్‌ఏటీఓ షేక్ ఖాదర్‌వలీ సూచించారు. సంగం, చిరమణ పీహెచ్‌సీలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవిలో ప్రజలకు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. సంగంలో ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాసులరెడి, ఆరోగ్య విస్తరణాధికారి మల్లెంకొండయ్య, మాధవ, జలీల్‌బాషా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరిలో గాలివాన బీభత్సం

ఉదయగిరి/సీతారామపురం: ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఈదురు గాలులు, ఉరుములు, మెరుపుల తో వర్షం పడింది. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి, అరటి, తదితర ఉద్యాన పంటలకు సైతం నష్టం వాటిల్లింది. కాగా ఉదయం నుంచి భానుడి ప్రతాపంతో అల్లాడిన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడడంతో సేదతీరారు.

పదోతరగతి విద్యార్థులకు అభినందన



సంగం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ షాలెట్, డిప్యూటీ డీఈఓ జానకీరాం, ఎంఈఓ మల్లయ్య, ఆపస్ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ మాట్లాడుతూ ఆపస్ ఉపాధ్యాయుల సమస్యలు, హక్కుల కోసం పోరాటాలు చేయడమే కాకుండా విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఆపస్ రాష్ట్ర నాయకులు చక్రపాణి, నాయకులు సురేంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దశయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన



పడమటికంభంపాడులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం

ఉదయగిరి రూరల్/చేజర్ల(ఆత్మకూరు): ఉదయగిరి మండలం గండిపాళెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గండిపాళెంలో ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు కే విజయకుమారి, ఎస్ మహాలక్ష్మమ్మ కిశోర బాలికలకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, ఆరోగ్యసంరక్షణ, రక్తహీనత, నాణ్యమైన విద్య, పరిశుభ్రత, ఆత్మరక్షణ, వేధింపుల నుంచి రక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ పీవీ రత్నం తదితరులు పాల్గొన్నారు. అలాగే చేజర్ల మండలం తూర్పుకంభంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్‌ఎం మస్తానమ్మ, అంగన్‌వాడీలు సీహెచ్ పద్మావతి, ఎం వెంకటరత్నమ్మ, ఆశాకార్యకర్తలు పద్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా కల్వర్టు



అల్లూరులోని పాత పెట్రోల్ బంక్ వద్ద మెయిన్‌రోడ్డులోని కల్వర్టుపై కాంక్రీట్ లేచిపోయి ఇనుపకమ్ములు బయటపడి ప్రమాదభరితంగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు వెళ్లే క్రమంలో ఇనుపకమ్ములు పైకి లేచి తగులుతుండడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ ద్విచక్ర వాహచోదకుడు కమ్ములు తగలడంతో గాయాలపాలయ్యాడు. ఇదే మార్గంలో నిత్యం మండలాధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

–అల్లూరు

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన



ఉదయగిరిరూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఎంపీడీఓ అప్పాజీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మహిళ స్వయం ఉపాధికి కుట్టు శిక్షణను అందజేస్తున్నట్లు తెలిపారు. 90 రోజుల పాటు క్రమం తప్పకుండా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, కుట్టుమెషీన్లు అందజేస్తామని వివరించారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు నాజియాతాజున్, ట్రెయినర్ పద్మ, స్థానికులు బయ్యన్న, బొజ్జ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన పెదవెంకటసుబ్బారెడ్డి

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగనాయుడుపల్లికి చెందిన కల్లూరి పెద్ద వెంకటసుబ్బారెడ్డి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు..కల్లూరి పెద్ద వెంకటసుబ్బారెడ్డి మోటార్ సైకిల్‌పై సీతారామపురానికి బయలుదేరాడు. అయ్యవారిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ముందు వెళ్తున్న మరో మోటార్‌సైకిల్‌ను ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో వెంకటసుబ్బారెడ్డి తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పులను పెంచాలి



మాట్లాడుతున్న శివకల్పన

ఉదయగిరిరూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులను పెంచాలని మండల వైద్యాధికారిణి శివకల్పన అన్నారు. పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్రం పాత భవనంలో ఆశా కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు నూతనంగా ప్రవేశపెట్టిన యాప్‌లు, న్యూమాడ్యుల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నూరు శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలను పెంచాలన్నారు. సీహెచ్‌ఓ శివకుమారి, ఆరోగ్య బోధకుడు కే వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్లు చెన్నయ్య, అంకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తమాపై అప్రమత్తత అవసరం

వింజమూరు(ఉదయగిరి): ఆస్తమాపై అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే దీర్ఘకాలిక వ్యాధిగా మారే అవకాశం ఉందని విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి అన్నారు. వింజమూరులోని మాశిలామణి వైద్యశాలలో ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊపిరితిత్తుల్లోకి దుమ్ము, ధూళి చేరినప్పుడు దగ్గు రావడం సాధారణమని, అది ఆస్తమాగా మారి దీర్ఘకాలిక వ్యాధిగా మారే ప్రమాదముందన్నారు. ఆస్తమా వ్యాధి నివారణకు ప్రస్తుతం అనేక చికిత్సలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డాక్టర్ ప్రశాంత్, వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

ఉత్తర కాలువ ఇలా..సాగునీరు పారేదెలా?



చిలకలమర్రి వద్ద ఉత్తరకాలువలోకి వాలిపోయిన కంపచెట్లు



గౌరవరం వద్ద కంపచెట్లతో మూసుకుపోయిన ఉత్తరకాలువ

అనంతసాగరం మండల పరిధిలో సోమశిల ఉత్తరకాలువను కంపచెట్లు ఆక్రమించాయి. ఏళ్ల తరబడి కంపచెట్లను తొలగించకపోవడంతో కాలువలోకి వాలిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ఎడగారు పంటలకు సోమశిల జలాలను విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ తరుణంలో కాలువ దుస్థితిలో ఉంటే సాగునీరు ఎలా సజావుగా సాగుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించి సాగునీరు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–సోమశిల